# ప్రపంచ పౌరుడు

అది ధనుర్మాసం. ఇంకా సరిగ్గా చెప్పాలంటే డిశంబరు 26 వ తేదీ. 25 కిసిమిసి పండగ, క్రిస్టియనులకు జరిగిపోయింది. 27 హిందువులకు ముక్కోటి ఏకాదశి రానైయుంది. ఆ కారణంగా డిశంబరు 26 వ తేదీ ఉదయం ఉభయ మతస్థులు కలిసికొన్నప్పుడు, తప్పకుండా, ఆయామతాలయొక్క తమతమ భేదాలను గూర్చి నిరూపించుకోవడం ఆ యేడు తప్పింది కాదు. అందులోనూ ఆ రెండిళ్లు ప్రక్కప్రక్క యిళ్ళు. ఆ యిళ్ళల్లో నివసించే వాళ్ళు, ఒకయింట్లో ఒక కన్నె, ఒకయింట్లో ఒక కన్నె. ఆ యిద్దఱికన్నెలను తప్పిస్తే మఱి యొండొరులతో ఈడూ జోడుగా మాటాడుకునే వయస్సు వాళ్ళుగాని, వాలకంవాళ్లుగాని, యూహముగలవాళ్ళుగాని, మోహముగలవాళ్లుగాని వేరేలేరనుకోవచ్చు ; ఇతరు లెంతమందివుంటేం గనుక ఆ పేటలో !

పేట అంటే ఇతరదేశాల్లో ఏయేకూటమి గలవాళ్ల కలిసి ఒక పేటగా ఏర్పడివుంటారో నాకు తెలియదుగాని, నే వ్రాస్తూవున్న యీ కథలోని పాత్రలు, భారత్యూనియన్‌లోని వారలవడంచేత అందు గల ఊళ్ళనుగురించి, పేటల్నిగురించి మాత్రం, నేను భారతీయుణ్ణి కాబట్టి ఎరుగుదును.

సర్వసాధారణంగా ఏయూరు చూచినా, ఏ పట్నంచూచినా, బ్రాహ్మలంతా ఒకచోట, లేదా కోమటి బ్రాహ్మలంతా ఒకచోట, క్షత్రియులు ప్రత్యేకంగా ఒకచోట, కమ్మవాడు కాపువారు మరోచోట ఇలా సవర్ణులంతా ఒక గుంపుగా ఉంటే, మరో గుంపుగా

అవర్ణులన్న వాళ్లు ఉంటూ వుంటారు. ఈ మధ్య ఈ అవర్ణులుండే జాగాను వెలివాడ అని, మాలగూడెం అని పిలవడం మానేసేసి, దేశభక్తుల ధర్మమా అంటూ హరిజనవాడ అనడం సాగిస్తూ వున్నారు. పేరు అంటే మార్చారేకాని, వాళ్ళ ఆర్థికావస్థ, వాళ్ళ ఆరోగ్య వ్యవస్థ మార్చగలిగే మహానుభావులు లేనేలేరనవచ్చును. అటువంటి హరిజనవాడలో అక్కడక్కడ క్రిస్టియన్‌లు, తమ స్థిరస్థానానికి, చలనం కలుగకుండా, అనగా వాళ్ళ పుట్టు పూరో త్రపుటిండ్లు వాకిండ్లు విడిచిపెట్టకుండా, అక్కడక్కడ, సహారాలో ఒయాసిస్సుల్లా, కనబడతారు ఈ క్రిస్టియన్లుకూడా భారత్యూనియన్‌లో ప్రజలే. అసలు భారత్యూనియన్ మతమ్మీద ఆధారపడివున్న దేశంకాదు. లౌకికమైంది. ఆ కారణంగా ఎవరెక్కడ ఏ మతాభిప్రాయంతో విలసిల్లినా వేర్పాటులేకుండా ఏలే స్వభావం ఆ ప్రభుత్వం అలవరుచుకుంది.

ఈ ఉపోద్ఘాతవివరములో అసలు కథ మఱచిపోతానో ఏమో !

నేనన్న ఇద్దరు కన్నెలు చెరో ఇంట్లోను ప్రక్క ప్రక్కల్ని కాపురాలు చేస్తూవున్నారు. కాపురాలు చేస్తూ కన్నెలున్నారు అంటే, వాళ్లెంత ఎత్తు, ఎంత ఏపుగలిగివున్నవాళ్లో వర్ణించడ మనవసరం. అయినా కొద్దిగా చెప్తాను, ఎందుకైనా మంచిది.—ఎవరి సంపాదన వారు చేసుకుంటూ, ఎవరి పొయ్యి వారు రాజేసుకొంటూ, ఎవరి పక్క వాళ్ళు వేసికో గల స్వతంత్రత గలవాళ్లు ఇద్దఱూ కూడాను. హరిజన కన్య పేరు " కువల యార్ద్రి " క్రిస్టియన్ కన్య పేరు " రెబెక్కమ్మ "

కన్యల యిద్దఱియిళ్ళకు మధ్య, పురాతనకాలంనుంచి పెరుగుతూ తరుగని ఒకానొక కట్టవ వుంది. ఆదిలో ఆ పేట

ఒక పొలం కావడంవల్ల, ఆ పొలంయొక్క రెండుమళ్ళకు మధ్య పోసిన ఒకానొక మండడిగట్టే ఆ రెండిళ్ళకు సరిహద్దుఅయి, దానిమీద పడి మొలిచిన ప్రతీ మొలకను ఎదగనివ్వడంచేతను పెద్ద కట్టవగా తేలింది. తొల్త పూర్వీకు లొకరొకరికి, గట్టుమీద మొలిచిన చెట్లు సందులమ్మట కనబడుతూవచ్చినా, క్రమ క్రమంగా రొట్టాపట్టా బలిసిపోయి, యీ తరంవారి నొండొరులు చూచుకోకుండా చేసి పారేసింది. ఏదైనా ఒకరితో వొకరికి తమలో తమకు కువలయార్ధ్రికు రెబెక్కమ్మకు చెప్పుకోవాలని వుంటే తమతమ వీధి గుమ్మాలు వెలువడి ఒకరి తలుపు ఒకరు తట్టుకోవలసిందే! అందులోనూ ఒకళ్ళు కిరస్తానీవాళ్ళు అని, మరొకళ్ళు అరుంధతీయులని అనుకొంటూ వున్నంతసేపు వారిరువురిమధ్య అన్యోన్యత ఇంతలో ఏర్పాటు కాగలదని పొరకు లనుకోవడం వెట్టి.

కువలయార్ధ్రి జీవితానికి రెబక్కమ్మ జీవితానికి పోలికే లేదు. ఏనాడో ఆ పేటంతా అంటుకుని, అందున్న ఇళ్ళన్నీ తాటాకు ఇళ్లు కావడంచేతను, సమస్తం పరశురామప్రీతి అయి నప్పుడు, వీళ్ళ పూర్వీకులు వాళ్ళ పూర్వీకులు కలిసి నీళ్ళుమోసి పోసి, ఆర్పుకొని ఆరుబయట అన్యోన్యం అనునయించు కున్నారో, మరి ఎన్నుకున్నది లేదు; మన్నించుకున్నది లేదు. అప్పటికి ఇప్పటికి కులవృత్తి మానుకోకుండా కువలయార్ధ్రి కోతలకెళ్ళి, ఊడుపులూడ్చి, పచ్చగడ్డిమోపులెత్తుకుని విచ్చలవిడి మచ్చికతో పెరిగింది. రెబక్కమ్మ స్కూలుఫైనల్‌దాకా చదువు కుని, ట్రైనింగు అయి, ఒక మిస్ట్రెస్సుగా పనిచేస్తూ, పృచ్ఛి స్తేనేగాని జవాబు చెప్పని బిగువుతో ఎదిగింది.

రూపానికి మళ్ళీ ఇద్దరూ ఒకటే! గబ్బితనంలోనూ, గుబ్బతనంలోనూ, నిబ్బరంలోను, అబ్బురంలోను సరిసమానులు. అయితే చీరకట్టు, చెంగువిసరు, సిగచుట్టు, ముంగురుముసురు, ఇలాంటివాటిల్లో వేర్పాటు ఎవరికివారే అన్నట్టు కాపరిచేరు. ముఖ్యంగా వీధమ్మట వెళ్ళేటప్పుడు కువలయార్ద్రి చేతిలో నిడుపాటి వడపలు, రెబక్కమ్మ చేతిలో కుఱుచ గొడుగు, ఎవరి అందము వారిదే ఎవరి చందము వారిదే అని రూఢి గొల్పేవి. దానాదీనా ఒకరు ఒక యింట్లోకి వేఫే వేటే ప్రవేశించడంకూడా పాంథజనులకు ఆనవాలై పోయింది.

ఒక పాంథజనుడు కువలయార్ద్రి యిల్లు చూపించి, " ఈ యింట్లో ఎవరు వున్నారోగాని వారివల్ల మన దేశములోని తిండి సమస్య పరిష్కారమయ్యేని " అంటే, వేఱొక పాంథ జనుడు రెబక్కమ్మ యిల్లు చూపించి ఈ యింటివారి జీవితపు కొలమానముతో సమానమైన కొలమానం మఱెందునూకానం " అనేవాడు. నాకు మాటలయొక్క అర్థం తెలియకపోయినా ఆ మాటలు విన్నప్పుడల్లా, రెండు గోచరించేవి. ఒకటి— కువలయార్ద్రియొక్క నలుచతురపు మూరముంగిట్లోను ఇట్టలంగా ఎదిగి ఇంపుగాపూసి సొంపుగా కాస్తూవున్న చిక్కుడుపాదు కవి పించేది రెండు—రెబక్కమ్మ బెత్తెడువాకిట్లోను, సీతాకోక చిలుకలు వాలినట్లు అగపించే రంగురంగుల క్రోటను మొక్కలు గల కుండీలుండేవి. ఆపాదంత విస్తరింపుగా ప్రాకి అంత విరివిగా ఏలా కాసేనో మనయింట్లో పాదెడితే మాడిపోతుంది అని ఒకడనుకుంటే, ఆ కుండీలోకి ఏరకం ఏయేతమొంచేనో, పెంట యెత్తి ఆపె, తానెంత సేవచేసినా తాతలేవలేదే మొక్కకు అని మఱొకడు మిడుతూ మిడుతూ చూసేదు!

ఆలా తమకేసి చూచేవాళ్ళను ఆ కన్నెలున్నూ, జాలకం బులగుండా చూచినట్లు తమ కన్నులరవాల్చి రెప్పలంట జూచే వారు. ఉ, ఇదయ్యేవారు తమర్ని ఆ పాంథజనుల్లో ఒక్కడైనా పెళ్ళాడకపోతాడా అని.—చూడ్డం అంటే సుళువుగాని పెళ్ళిచేసి కోవడం అనేది ఏ దేశంలోనూ కష్టమే. అందులోనూ భారత దేశంలో మఱీ కష్టము. ఇప్పటికే జనసంఖ్య మితిమీఱి వుంది. ఇంకా స్త్రీ పురుషాదులు వివాహమై శిశువుల్నికంటే, వాళ్ళందఱినీ మేపి, సాపుచేసి, చక్కపఱచి, సంపల్లలితమైన సరఫరా ఏ సర్కారు చేయగలదు ?

ఇదంతా నిత్యం వార్తాపత్రికల్లో కూలంకషంగా చెఱగ బడ్డం కన్నె లిద్దఱికూ తెలుసును. ప్రతీయువకునికీ తెలుసును. తత్రాపి ఇద్దఱుకన్నెలూ కూడా తాము స్వార్జితంగా కొంత డబ్బు అనగా అధమం ఒక్కొక్క రొక్కొక్క పదివేల రూపాయ లైనా కొతాలో నిలవవేసికొందే పెళ్ళాడరాదనికూడ బలుక్కు న్నట్లు అలాగే వుండిపోయేరు, ఏలాంటి మనువూ లేకుండా.

ఏళ్లు జరిగిపోజొచ్చాయి. గోవాళ్లు ఆ యింటికీ ఈయింటికీ కూడా వచ్చి నిరాశాపరులై పోతూవుండేవారు. ఇలా వుంటూ వుండగా ఓ ధనుర్మాసంలో వచ్చిన డిశంబరు 25 వ తేదీ రాత్రి ఏంజరిగిందీ అంటే—రెబక్కమ్మ ప్రతీ క్రిస్టమస్ పండక్కీ నిలిపి నట్టే ఒక కిసిమిసిచెట్టు ప్రాంగణంలో ఎత్తుగా నిలిపింది. పరవుగా కొమ్మలు రెమ్మలు, అమరిచి, బొమ్మలూ సొమ్ములు కుదిరిచి, కిసిమిసి తాతకోసం వేచివుంది. బైబిలులో ఏసుజననం అన్న దాన్ని గురించి చదువుతా వుంది. అదేవేళకు కువలయార్ధ్రి తన వాకిట్లో కళ్ళాపు చల్లి, వరిపిండితో రథం, నాగుబాము,

పద్మం, ఇలాంటి ముగ్గులు పచరించుకు వెన్నెల్లో సందర్శిస్తూ, తన కులవేలైవన "కొంతి"ని సంస్మరించుకుంటూ వుంది ఇద్దరూ అప్రయత్నంగా ఒకేసారి కునుకు గన్నారో ఏమో,—కల్లో— ఇద్దఱకూ ఒకేసారి మెలకువ వచ్చేలా, ఆ రెండిళ్ళకు మధ్యన వున్న కట్టవలో చంటిపిల్లవానియొక్క "కేరు కేరు" ఏడ్పు వినబడ్డట్టయింది.

వెంటనే ఈ తట్టునుంచి ఒక ఎండు తాటాకు అంటించు కుని కువలయార్ద్రి తనవైపు కట్టసమ్మట నెరుకసాగింది. ఆ తట్టునుంచి రెబక్కమ్మ ఒక టార్చివేసుకు చూడసాగింది. కాని ఒకరి వెలుగు ఒకరికి కానబడ్డంలేదు. అంత దట్టంగా అల్లుకు పోయి అదంతా అంధకార మయమయి వుంది. రెండెంపులా వెలుగు ప్రసరించినా ఆ వెలుగు.

ఇరువురూ క్రమంగా కట్టవచివరకువచ్చి నిలబడిపోతూ, ఒకరిమీదకు ఒకరు తమతమ దివ్వెలను వేసుకున్నవారై విస్తు పోయి, "మనిద్దఱకూ ఈ పొద్దు ఒకేరకపు కలవచ్చి నట్లుందే! మనిద్దఱం ఒకే రకం ధ్వనివిని లేచినట్లున్నామే! కాని కట్టవలో ఏమీ కనిపించదే!" అని అనుకొన్నారు. "ఏమిటా వెన్నె ట్లోను ముంగిట్లో కొత్తచెట్టు?" అని అడిగింది కువలయార్ద్రి. "అదే మా కిసిమిసి మహావృక్షము. అయితే ఎందుకు? దాన్నప్పుడే నీ చిక్కుడుపా దలుముకు పొయ్యేని" అంది రెబక్కమ్మ. "నే నిప్పుడు పెట్టానో లేదో ముగ్గు, నీ ఎఱ్ఱచీమలు చూడు అప్పుడే వచ్చి ఏలా తినేస్తున్నాయో పిండిఅంతా" అంది కువలయార్ద్రి.

"ఏమిటా ముగ్గు? ఎందుకు పెట్టేవు?" అని అడిగింది రెబక్కమ్మ కువలయార్ద్రిను. అడిగితే "మేం, హరిజనులమన్న

మాట తెలుసా? మాది హిందూమతమని ఎరుగుదువా?—ఆ మతాన్ని అనుసరించి ధనుర్మాసం ఆరంభంనుంచి, రాత్రిళ్ళు కళ్ళాపుసల్లి పిండిముగ్గులు పెట్టుకుంటాము! అది మా మతం!" అంది కువలయార్ధ్రి. "ఎవరు చెప్పేరు నీకిదంతా?" అని అడిగింది రెబక్కామ్మ. మా మాల పురోహితుడు చెప్పేడు. మరిన్ని నిత్యం మా కులవేల్పైన కుంతి కథ చెబుతూ, కర్ణుని జన్మవృత్తాంతం దగ్గఱ కొచ్చేసరికి ఆపేస్తూ-వెలుగు చూడు! సూర్యోదయం చూచి నమస్కరించు అని బోధచేసి తెల్లాఱకుండా తాను తిరోహితు డయ్యేడు" అంది అతి అమాయకంగా. రెబక్కామ్మకూడా తన మనసు తేటతెల్లమయ్యేలా ఎఱుకపరిచింది; తనవద్ద కప్పటప్పట దైవజ్ఞాన గురువువచ్చి దేవుని వేదగ్రంధాన్ని బోధపఱచి, అందులోని క్రీస్తు జననఘట్టం వినిపించేడని. వినిపించి వినిపించి దీపమార్పేసి చూడు ఇలా చీకటిమయంగా వున్నప్పుడు మేరీ కన్య పశువులకొట్టంలో క్రీస్తుని కన్నదని వివరించి తిరిగి దీపం ముట్టించేడని.—అయితే మీ మతం చీకటిగుండా వెలుతురులోకి తీసుకువెడుతుంది కాబోసు. మా మతం ఎప్పుడూ వెలుతురు మయమేను. అసలు కర్ణుడు పుట్టిందే వే వెలుగులవానికి. మరి చాటూలేదు, మాటూ కాదు." అంది కువలయార్ధ్రి. "ఏమైతేం! మీ మతంలోను ఒక కన్య, ఆ కన్యకు ఒక కొడుకు కలగడం! ఇలాంటి గాధ వుంది!" అంది రెబక్కామ్మ.—"ఏ మతంలోనైనా వెఱ్ఱితొఱ్ఱి గాధలుండకమానవు. ఇప్పుడు మనకు కట్టవలో వినబడ్డ బిడ్డ ఏడ్పులాంటివే ఆ గాధలు" అంది కువలయార్ధ్రి. దానిమీద రెబక్కామ్మకు మఱోసారి కట్టవఅంతా నెమకి చూద్దామని బుద్ధి

పుట్టింది. తనకు తోడు కువలయార్ద్రిను రమ్మనమంది. నిజం తెలుసుకుందామంది. మనిద్దఱకూ ఒకేలాంటి కల రావడం ఒకే చోట ఏడుపు వినబడ్డం అత్యంతరం ఆశ్చర్యమే" నంది. రెబక్కమ్మయొక్క వాగ్ధారకు లొంగిపోయినట్టుగా కువలయార్ద్రి ఆమె వెంట వెంట కట్టవింకో పాలి వెదకజొచ్చింది. కారు మనడం మానేసి ఈ మాటా శిశువు చిరునవ్వు నవ్వినట్టు అయింది. కాని రూపం ఏమీ కాపడదాయిరి.

చటుక్కన ఒకచోట కొ_త్తగా అప్పటికప్పుడు చంక కర్రలమీద నిలబడ్డట్టు నిలబడి పొడుగ్గా ఒక దైవికత్వం మానవత్వం కలసిన మహాదృశ్యం సాక్షాత్కరించి ఆ యిరువురకూ ఇలా ప్రబోధించింది. "నేనొక కుంటిదాన్ని, నాకొక శిశువు ఈ కట్టవలో కలిగాడు. వీణ్ణి మీ యిరువురకు ఒప్పజెప్పి నేను సెలవు పుచ్చుకొంటూవున్నాను. నేను కిసిమిసి ముక్కా ముసిలి తాతనూ కాను: అనూరుణ్ణీ కాను. నేను నేనే ఆడదాన్ని" అని దివ్యజ్యోతి అయి తిరోహిత అయింది.

"కల కాదు నిజంగా బిడ్డే! ఆ బిడ్డను కన్నది ఒక దేవత" అని కువలయార్ద్రి రెబక్కమ్మకూడా ఏకధాటీని నమ్మారు. ఒకే త్రాటిమీద నిలిచేరు బిడ్డను గురించి యోజించేటప్పుడు. కాని దేవతను గురించి ఆలోచనలో పడ్డప్పుడు మాత్రం ఆ దేవతకు ఎడంకాలు మాత్రమే కుంటి అని రెబక్కమ్మ, కుడికాలు మాత్రమే కుంటి అని కువలయార్ద్రి తగవుపడసాగారు. కట్టవలో బిడ్డడు నవ్వుమాని కెవ్వుమావి సెలవులంట తెల్లని చనుబాలు వెలలించేడు.

తెల్లారింది, సమస్తం లోకానికి వెల్లడిఅయింది. "మీరనే దేవతకే కాలుకుంటె అని మీరిద్దరూ తగవుపడేకన్న, ఏకుంటీలేని

యీ కూచినిచూచి సంతోషించండి !" అని యిరువురకు ప్రబోధం చేసేరు పట్నంలోని ప్రజఅంతా.

నాటినుండీ రెబక్కమ్మ, కువలయార్ధ్రి, మతం అన్నది మఱచి కట్టవకొట్టిపారేసేసి, ఏకండీ యిల్లుగా రెండిళ్ళూ గావించుకుని ఆ దొఱికిన బిడ్డణ్ణి దైవదత్తంగా చేకొని యిరువురూ కలిసి పెంచి పెద్దవాణ్ణి చేశారు. అతగాడు క్రమక్రమంగా శుక్లపక్ష చంద్రుడిలా పెరిగి ప్రపంచ పౌరుడయ్యేడు.

కథ కంచెకు వెళ్ళింది. మనం మనయింటికి వెళ్ళేం.

.... .... .... .... ....

## ఆస్తికత జీవనోపాధి

"చొక్కా చిరిగితె దర్జీ కుట్టు
జోడూ చిరిగితె 'గొడారి' కుట్టు,
దిక్కు చిరిగితె కుట్టే దెవడు ?"

అంటూ నడుస్తూ పాడుతూ, ఒకానొక బీబీ, గుబ్బెత, సిబ్బితి కత్తె చటాల్న ఆగింది రోడ్డువార చెప్పులు బాగుచేసే వాడిచెంత. ఆమె పేదతనంచే సరదా మానేసిందో సరదాచే మానేసిందో ఊహించడం కష్టం. కాని ఒకటి తేటతెల్లం. ఆమెను చూచేందుకు లోకం సరదాపడక మానదు. వాడు, ఆ గొడారి పాటను, అంత దూరాన్న బీబీ వుండంగానే, వినడం ప్రారంభించి, బీబీనిచూడ్డం మొదలుపెట్టినవాడై, ఆరి, లాసు, దిమ్మ, గూటం అన్నీ మరచి "దేవుడు" అని జవాబు చెప్పాడు. ఆ జవాబుకే ఆగినట్టుగా వుంది ఆ చేడియ ఆ గొడారివాని చెంత.